క్లుప్తంగా

రేపు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కొత్తచెరువు: ఈనెల 28వ తేదీన మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'సీఎంఆర్‌ఎఫ్'తో భరోసా



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణ, రూరల్ పరిధిలోని 12 మంది బాధితులకు గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ.24.30 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే నివాసంలో బాధితులకు అందజేశారు. 'సీఎంఆర్‌ఎఫ్'తో ప్రజలకు భరోసా లభిస్తోందన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో 'ఓపెన్‌హౌస్'



మాట్లాడుతున్న ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి

ఓడీచెరువు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు దిశ రిసెప్షన్ సెంటర్, రికార్డు రూమ్, వైర్‌లెస్ సెట్, కేసుల నమోదు, ఎఫ్‌ఐఆర్‌పై ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం పోలీసుల విధులను వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యాన్ని చూపుతున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని నేసేపేటలో కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ మహమ్మద్ రఫీ, సిబ్బంది బుధవారం రాత్రి దాడి చేశారు. ఓ టీస్టాల్ ముందు కర్ణాటక మద్యం విక్రయిస్తున్న దేవాను అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.28,207 విలువైన 116 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, 41 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఎవరైనా అక్రమంగా మద్యం, గంజాయి, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 9440796831 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేడు కదిరికి ఇచ్ఛాపురం పీఠాధిపతి రాక

కదిరి టౌన్: ఇచ్ఛాపురం పీఠాధిపతి బాల బ్రహ్మానందు సరస్వతి స్వామి శుక్రవారం సాయంత్రం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాస రెడ్డి, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు నరసింహతత్త్వము, ప్రవచనాలను చెప్తారని పేర్కొన్నారు.

'కార్గో సేవలు' వినియోగించుకోండి



మాట్లాడుతున్న డిపో మేనేజర్ ఇనాయతుల్లా

పుట్టపర్తి టౌన్: అతి తక్కువ ధరకే సరుకులు చేరవేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఇనాయతుల్లా పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి డిపోలో కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 84 కేంద్రాల్లో కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 10 కిలోమీటర్ల వరకూ ఈ కేంద్రాల ద్వారా సరుకులు డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 25 వరకూ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. డిపోల్లో ఉద్యోగులతో కలసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం



తాడిమర్రి మండలం కునుకుంట్లలో వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న దృశ్యం



బత్తలపల్లి: ఈదులముష్టూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిమనోహర్

తలుపుల: గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యం. ఇందుకోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ రఫీనాయక్, పార్టీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉబ్బరవాండ్లపల్లిలో వైద్యాధికారులు పున్వర్ బాషా, సల్మా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు రక్త పరీక్షలతో పాటు, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.శ్రీదర్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు, ఈఓపీఆర్డీ శకుంతల, ఈఓ మాధవరెడ్డి, పాల్గొన్నారు.

ఈదుల ముష్టూరు విలేజ్ క్లినిక్‌లో..

బత్తలపల్లి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్, వైద్యాధికారి గంగిరెడ్డి, ఈఓఆర్డీ దివాకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఈదుల ముష్టూరు విలేజ్ క్లినిక్ వద్ద వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 28 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఐదు దశల్లో స్క్రీనింగ్ చేసి, మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆసుపత్రిలో చేర్పి వైద్యం అందిస్తామన్నారు. ఇప్పటికే వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారన్నారు. కుటుంబ స్థాయిలో ఆరోగ్యం ఎలా ఉందో పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం వైద్యులు గంగిరెడ్డి, రామకృష్ణ, స్పెషలిస్టు డాక్టర్స్ గోపిక, సమీరారెడ్డి, వాసంతి ప్రజలకు వివిధ రోగాలపైన చికిత్సలు నిర్వహించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఏస్‌డీటీ శారద, సచివాలయ మంలల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, సీహెచ్‌ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ పాల్గొన్నారు.

వేళ్లమద్దిలో..

నల్లమాడ: వేళ్లమద్ది పంచాయతీ కేంద్రంలో గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బొజ్జేనాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఈఓ మీనాక్షి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వేళ్లమద్ది, కొత్తపల్లి తండా, కొండక్రింద తండాకు చెందిన 266 మంది వివిధ రకాల వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఇందులో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 75 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండకింద తండా సర్పంచ్ పార్వతీబాయి, ఎంపీడీఓ కొండన్న, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు, మండల వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్, రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరాలు..

తాడిమర్రి: మండలంలో గత కొంత కాలంగా అధికారులు, వైద్యాధికారులు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గురువారం కునుకుంట్ల గ్రామంలో ముగిశాయి. గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద అధికారులు, వైద్యాధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, రక్త, మూత్ర పరీక్షలు, కిడ్నీ, గుండె, ముగ్గు, చెవి గొంతు తదితర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 346 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సమస్యలు ఉన్న 23 మందికి మెరుగైన వైద్య, శస్త్ర చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం వృద్ధులకు కంటి అద్దాలు, పోషణ ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కామాక్షి, ఎంఈఓ వెంకటేష్, వైద్యులు కృష్ణప్రసాద్, సూపర్ వైజర్ రామ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్తలు జానకీరామ్, రంగనాయకులు, మాజీ ఎంపీపీ వడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు సల్లాపురం బాలరమణారెడ్డి, ఎంపీటీసీ సాకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కస్సుముద్రం పంచాయతీలో..

అమడగూరు: మండలంలోని కస్సుముద్రం గ్రామ పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. గ్రామ సచివాలయ ఆవరణంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి. గ్రామాల్లో సమస్యలు లేకుండా పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కార్యాలయాలకు సమస్యలపై వచ్చిన అర్జీదారులను మర్యాదపూర్వకంగా పలకరించాలని సూచించారు. సమస్యలను పూర్తిగా విని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. మండల వ్యాప్తంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మొదటి దశ, రెండవ దశలలో మంజూరైన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా జలజీవన్ మిషన్‌లో భాగంగా మండల వ్యాప్తంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు బిల్లులు త్వరగా అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సమస్యలు ఏవైనా ఉన్నాయా? అని ప్రజా ప్రతినిధులతో ఆరా తీశారు. ముఖ్యంగా విద్యుత్ సమస్యలను ఎక్కువ మంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. లోఓల్టేజీ సమస్య, కరెంట్ కోతలు తదితర సమస్యలను విన్నవించారు. సమస్యలను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరుగుతుందన్నారు. పెండింగ్ పనులను వచ్చే నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, జెడ్పీటీసీ తిరుమల బాయి, వైస్ ఎంపీపీలు వెంకటరెడ్డి, క్రిష్ణమ్మ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

• హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్



మంగాపురం సభలో మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

రామగిరి: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంగాపురంలో కనకదాస విగ్రహ ప్రతిష్టకు ఆయన హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను విస్మరించాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అందరికీ సమన్యాయం చేస్తున్నారన్నారు. రైతు పక్షపాతిగా పేరొందిన వైఎస్ కుటుంబం రాష్ట్ర వ్యాప్తంగా సాగు, తాగు నీటిని అందించినట్లు తెలిపారు. ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు అవినీతి కేసులో జైలులో ఉన్నారని, ఈ ప్రాంతంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా కొన్నేళ్లుగా పదవులు అనుభవిస్తూ ఈప్రాంతానికి చేసిందేమీలేదన్నారు. కనీసం పేరూరు డ్యాంకు నీరుతేలేకపోయారన్నారు. పార్టీ అధికారంలోకిరాగానే ఎంఎల్‌ఏ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హంద్రీనీవా ద్వారా నీరు తెచ్చారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప, జెడ్పీటీసీ నాగార్జున, ఎజ్జి అంజి, మల్లికార్జున, కురుబలు పాల్గొన్నారు.

భూ రీసర్వేను పక్కాగా చేపట్టాలి



గుర్రంబైలులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీకృష్ణ

తనకల్లు: భూ రీసర్వేను పక్కాగా చేపట్టాలని కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని బొంతలపల్లి, గుర్రంబైలు గ్రామాల్లో చేపట్టిన భూ రీసర్వేను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మండలంలోని ఉలవలవాడ్లపల్లి రెవెన్యూ గ్రామంలో ఇప్పటికే రీసర్వే పూర్తి చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నవంబర్ 14వ తేదీలోపు చీకటిమానిపల్లి, గుర్రంబైలు, ఈతోడు గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులతో మాట్లాడారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్హులకు అన్ని రకాల సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐ విజయకుమారి, తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఎంపీటీసీ శ్రీనివాసులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నిర్వాసితులకు త్వరలో ఇంటి స్థలాలు



మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్ రెడ్డి

కదిరి అర్బన్: చెర్లోపల్లి రిజర్వాయర్ కింద ఊటనీటితో ఇళ్లు దెబ్బతిన్న చిన్న దిగువపల్లికి చెందిన నిర్వాసితులకు త్వరలోనే ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని తహశీల్దార్ సునీత పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గంగన్నగారిపల్లి వివాదాస్పదంగా ఉన్న భూ సమస్య పరిష్కారమైందన్నారు. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, తహసీల్దార్ సునీత కృషితో ఆ స్థలంలో పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. అలాగే చిన్న దిగువపల్లిలో చెర్లోపల్లి రిజర్వాయర్ ఊటనీటితో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు త్వరలో ఇంటి స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. అందుకు స్పందించిన తహసీల్దార్ సాధ్యమైనంత త్వరగా ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే జగనన్న కాలనీలో కొన్ని చోట్ల విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయి. వాటిని పరిష్కరించాలని ఏఈ గౌరీశంకర్‌ను ఎంపీపీ ఆదేశించారు. మండలంలో అంగన్వాడీ కేంద్రాలపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పలు శాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ రాధాబాయి, ఎంపీడీఓ అంజనప్ప, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, ఏఓ శ్రీనివాసరెడ్డి, మండల విద్యాధికారి చెన్నకృష్ణ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో గురువారం జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రలో పాల్గొన్న కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు పీవీ సిద్దారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లికి చెందిన మహ్మద్ షఫీ కుమార్తె వివాహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బత్తల హరిప్రసాద్ రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని తన తండ్రి, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతులమీదుగా గురువారం అందజేశారు.

తలుపుల: మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన శ్రీనివాసులు ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ గురువారం గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బత్తల వెంకటరమణ, సైదాపురం రమణ, జయరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు ఇస్తున్న ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం రూరల్: పట్టణంలోని 16వ వార్డు గీతా నగర్‌కు చెందిన దాసరి గంగాధర్ ఈనెల 24వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ గురువారం స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు.

ఆర్బీకేల్లో పంట నమోదు ముసాయిదా జాబితా

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలంలోని గ్రామాల్లో 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల నమోదు జాబితాను ఆర్బీకే, సచివాయాల్లో ముసాయిదా జాబితా ప్రచరించినట్లు బుక్కపట్నం ఏఓ సతీష్ బాబు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను బయోమెట్రిక్, ఓటీపీ ద్వారా ఈ-కేవైసీ చేయించడం జరిగిందన్నారు. ఈ పంటల జాబితా నమోదును ఆర్‌బీకేలు, సచివాలయాల్లో ప్రచరించడం జరిగిందన్నారు. ఈ జాబితాలో పొరపాట్లు ఉంటే గ్రీవెన్స్ రూపంలో ఆర్‌బీకేల్లో సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీలోపు సిబ్బంది పరిష్కారం చూపుతారన్నారు.

పండ్ల తోటల పరిశీలన

గాండ్లపెంట: తూపల్లి గ్రామ పంచాయతీలోని వంకపల్లి వద్ద రైతు పాపిరెడ్డికి చెందిన పండ్ల తోటను గురువారం ఎంపీడీఓ రామానాయక్, ఏపీఓ మంజునాథ్ పరిశీలించారు. మూడు నెలల క్రితం ఉపాధిహామీ పథకం కింద ఎకరా పొలంలో 70 మామిడి మొక్కలను నాటాడు. ఉపాధిహామీకి సంబంధించి రావాల్సిన బిల్లులు వచ్చాయని రైతు తెలిపాడు. అనంతరం మండల కేంద్రానికి సమీపంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

అణగారిన వర్గాలపై టీడీపీ దౌర్జన్యం సరికాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రామగిరి: అణగారిన వర్గాలపై టీడీపీ నాయకుల దౌర్జన్యం సరికాదని ఎస్సీసెల్ నియోజకవర్గ కన్వీనర్ బండారు అనిల్‌కుమార్, మండల కన్వీనర్ కత్రా హనుమంతరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ హెచ్‌ఎస్ ముత్యాలు, సర్పంచ్ మీనుగ నాగరాజులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇటీవల మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తినాయుడు అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటర్వ్యూకు వెళ్లకుండా గంగంపల్లికి చెందిన ముకుంద అనే మహిళను గృహ నిర్బంధం చేయించాడన్నారు. దశాబ్దాలుగా ఈప్రాంతంలో టీడీపీ అధికారం ఉండి, అణగారిన వర్గాలను అణచివేస్తున్నారన్నారు. మేం చెప్పిందే వేదం అంటూ వారికి అనుకూలంగా ఉన్నవారికే పదవులు, ఉద్యోగాలు ఇచ్చేవారన్నారు. అయితే పార్టీ మారినా నేటికీ టీడీపీ నాయకుల దాష్టీకాలు, దౌర్జన్యాలు తగ్గిపోలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, సర్పంచ్ సిద్ధన్న, నాయకులు ఓబులేష్, కేజీ నాగరాజు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలసిన నేతలు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఎస్ మక్బుల్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు బీఎస్ మక్బుల్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

భూ సమస్యపై ఆరా

అమడగూరు: మండలంలోని గడిదంవారిపల్లి రెవెన్యూ పొలంలో నెలకొన్న భూ సమస్యపై తహసీల్దార్ వెంకటరెడ్డి ఆరా తీశారు. గురువారం సమస్య ఏర్పడిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన ఎల్లప్ప ఇరుగుపొరుగు పొలాల రైతులతో ఏర్పడిన సమస్యపై లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు తహసీల్దార్ పొలాలను పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా శనివారం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ ఈశ్వరయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్ట తండాలో గురువారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ ఆధ్వర్యంలో తాగునీటి బోరు వేయించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డికి విన్నవించారు. వెంటనే బోరు వేయించి దాహార్తి తీర్చాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీటీసీ అల్లాబకాష్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ వెంకటేష్ నాయక్, శ్రీన, తిరుపాల్, అంజి పాల్గొన్నారు.

స్థలం విషయంలో ఘర్షణ

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని గజ్జలరెడ్డిల్లిలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య స్థలం విషయంలో గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. లోకేష్, లక్ష్మీపతి అన్నదమ్ములు. వీరికి గజ్జలరెడ్డిపల్లిలో స్థలం ఉంది. ఆ స్థలంలో నాకు కుడా బాగం ఉందని అక్క ఉత్తమ్మ చెప్పడంతో గొడవ జరిగింది. తనపై ఉత్తమ్మ భర్త శ్రీనివాసులు, మురళి, కృష్ణమూర్తి దాడి చేశారని లక్ష్మీపతి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే లక్ష్మీపతి, లోకేష్, సుబ్బరాయుడు, అంజినమ్మ మాపై దాడి చేశారని శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నివాళి



మృతురాలికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వేపకుంట రాజన్న భార్య ప్రమీలమ్మ (51) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి తల్లిమడుగులకు వెళ్లి ప్రమీలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేపకుంట రాజన్న, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు నాగముని, యూత్ కన్వీనర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.